మహారాజ యోగం

పి.ఎస్.నారాయణ

సింహాద్రి లేచి నిలబడ్డాడు. ఒక్కసారి కాళ్ళూ, చేతులూ ఝాడించి, ఎవరిచేతులోనో ఉన్న హుక్కాను విసురుగా లాక్కొని నాలుగు దమ్ములు గుడగుడా లాడించి బయటపడ్డాడు.

ఏమిటో వూరంతా హడావుడిగా ఉంది. కోట ద్వారాల నుండీ, రాజమార్గమంతా ఇసకేస్తే జుట్టు మీద పడేంతగా కిక్కిరిసిపోయి ఉంది. సింహాద్రికేం అర్థంకాలేదు. రెండు రోజుల క్రితం ఎవరి దేవిడీ లోనో సంతర్పణయితే భోంచేసి కోట ముంగిట ఉన్న ఈ సత్రపు అరుగుమీద మేనవాల్చి కునుకు కుపక్రమించినట్టు గుర్తు! . తరువాత మెలుకువ వచ్చి చూస్తే ఈ హడావుడి!

పంచె పైకెగదీసి కట్టి ముందుకు జనసముద్రంలో ఎదురీది తలెత్తి పైకి చూస్తే వంద గజాల దూరంలో సింహం నోరులా, రాజావారి బోసులా, మరేదోలా కోట ద్వారం కనబడింది. రాజభటులంచే వెనక్కి నెట్టబడుతున్న మొట్టమొదటి వారికి వెనగ్గా ఉన్నాడు తను.

తల సగం వాల్చి సవినయంగా అడిగాడు రెండు తలకాయ లవతలున్న ఒక గండు మీసాలాయన్ని సింహాద్రి "ఏమిటీ హడావుడి అవటా ?" అని దానికి సమాధానంగా ఆ పెద్దమనిషి తాటిచెట్టు మీద నుండి క్రిందనున్న పూచికపుల్లను చూచినట్టుగా సింహాద్రిని చూచి, మీసం మెలేసి, కళ్ళల్లో గుప్పెడు నిప్పులు వేసుకొని, కాస్త రాజరీవితో హూంకరించి "బతికిపోయావ్ ఫో! ఒక్క ఐదు నిముషాల తరువాత అడిగివున్నట్లయితే నీ తల తీయించి, నీ శరీరాన్ని నా శత్రురాజు పుట్టినరోజు కానుకగా పంపివుండేవాడిని!" అని క్షణంలో చూపు మార్చేశాడు

సింహాద్రి బిక్కచిక్కిపోయి కొయ్యలా బిగుసుకుపోయాడు. "ఇదేమిటీ .... ఇదా న్యాయం ఐదు నిముషాలు ముందడిగాను ... లేకపోతే ఈపాటికి నా శరీరం కాస్తా ....'' అనుకో—

జనం గోల సముద్రపు హోరులా లేచింది మాడిన మసాలా దినుసుల వాసనలా పాకిపోసాగాయి.

ఎవరి నోట విన్నా 'రాజావారి నల్లేను గొచ్చే స్తోంది!' అనే ! ప్రతివాళ్ళు వాళ్ల మెడలను ముందుకు పోటానుపోటీలుగా, ఏనుగు మావటీడుకు ఒక్క మెడకాయలే కనబడేలా, ఏనుగు తొండం దగ్గరకు సాగదీల్తున్నారు. దాని తొండానికున్న తెల్ల మల్లెపూల దండమీదే దిష్టి తగిలేలా అందరి దృష్టి వున్నది !

అసలు సంగతి—

హఠాత్తుగా అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో ఆ దేశపు రాజావారు కన్ను మూశారు. తరువాత పన్నెండు గంటలలోగానే మరో రాజా వారిని గద్దె ఎక్కించటం ఆ దేశపు ఆచారం.... .. అందుకుగాను రాజావారి నల్లేనుగు ఎవరి మెళ్లో మల్లెదండ వేస్తే వారు మహారాజు లవ్వటం కద్దు!

కాని సింహాద్రికిదేం తెలియదు. అందుకనే తన మెడని తన దగ్గిరే పెట్టుకొని వింతగా చూస్తున్నాడు.

కాని విధి మరోలా వుంటే సింహాద్రి ఏం చేయ గలడు ? .... ఆ నల్లేనుగ కాస్తా తెల్ల మల్లెపూల దండను పరుగెత్తుకుంటూ వచ్చి అతడి మెళ్లోనే వేసింది !

మరుక్షణంలోనే ఒక భటుడు ఒంటిచేత్తో సింహాద్రిని ఆకాశంలోకి ఎత్తేసి, నాలిక్కరుచుకొని, చేతిని క్రిందకు లాగేసి, 'మీ పేరు ?' అంటూ చెవులో చిన్నగా గొణిగాడు.

చెప్పాడు సింహాద్రి.

"శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ సింహాద్రి మహారాజులుం గారికి ...."

'జై' లతో ఆకాశమంతా దద్దరిల్లిపోయింది !

* * *

"లేస్తారా ? లేవరా ? ఏంటిటా మొద్దు నిద్ర మా నాన్న పెద్దమ్మలా ?" అన్నది సింహాద్రి భార్య సీతామహాలక్ష్మి విసుగ్గా విసురుగా.

"లేచి అరగంటయింది.... నీ ముఖం కోసరమే అరగంటపట్టి దుప్పటిలో ముడుచుకు పడుకున్నా!" అన్నాడు సింహాద్రి ఆవలింతను బలవంతాన గుటక వేస్తూ.

"బడాయిలకేం గాని .... త్వరగా లేవండి !" అన్నది సింహాద్రి మాటలకు కాస్త ఉబ్బి నవ్వును మొఖాన రుద్దుకుంటూ సీతామహాలక్ష్మి.

వాకిట్లో సైకిల్ గంట సైరింజన్ గంటలా మ్రోగింది. పాలవాడేమోనని ఇద్దరి మెడకాయ లను ఒక్కసారే బయిట వైపుకు తిప్పారు—కాదు ! ఎర్ర సైకిల్ ! .... టెలిగ్రాం మనిషి !

సీతామహాలక్ష్మి ఎగిరి గంతేసింది.

"మా రుక్మిణి పెండ్లికూతు రాయనే !" ఎన్నో రాగమో తెలుసుకోలేనంత తొందరగా అనేసి ఒక దీర్ఘం లాగేసింది.

ఆ టెలిగ్రాం ఏంటిటో చదవకముందే దాంట్లో సంగతులు ఆ దంపతులకు తెలును !

సీతామహాలక్ష్మి చెల్లెలుకు— స్వయానా సింహాద్రి మరదలకు పెండ్లి లగ్నం పెట్టేశా రన్నమాట ! .... మామగారు ఇస్తానని మరీ ఇచ్చిన టెలిగ్రాం అది !

సంతకంచేసి లోపలికి టెలిగ్రాం పట్టుకొచ్చిన సీతామహాలక్ష్మి, మంచం మధ్య కూర్చున్న ఆయన వేతికిస్తూ, "మా శ్రీవారు మహారాజాయెనే !" అని ఖుషీగా రాగ మాలాపించింది.

"అదేవిటి కొత్త స్లోగాన్ ?" అన్నాడు సింహాద్రి ఆనందాన్ని ఎక్కేస్తూ.

"ఇక ఈ గృహ సామ్రాజ్యానికి మీరేగదా సర్వాధి కారులు ! .... ఎన్నాళ్లబట్టో తీరని కోరికాయె! ... ఈడేరబోతోంది .... మా చెల్లెలు పెండ్లి గాదు గాని మీకు మహారాజయోగం పట్టింది !" అన్నది. అంతటితో ఆగకుండానే "యోగం పట్టింది గదా అని అలాగే ఉండిపోయేరు .. పెండ్లి రేపనగా నైనా తప్పకుండా రండి !" అని మరీ మరీ చెప్పింది.

సింహాద్రి మీసం మెలేశాడు లేకపోయినా ఉన్నట్లుగా !

* * *

సీతామహాలక్ష్మిని రైలెక్కించి వచ్చి నడిమింట్లో నిలబడి పురి విప్పిన నెమలిలా నాట్యం చేశాడు. సిలోన్ పెట్టుకొని వంత పాడాడు. ఆ సంతోష సమయంలోనే హోటల్‌కు వెళ్లి రెండు ప్లేట్ల స్వీట్లు లాగేశాడు. కాఫీ అడిగితే లేదన్నాడని కోప మొచ్చి ఓవోమాల్టు త్రాగాడు.

ఇంకెందుకు లె—బాబోయ్ .... ఒకటా ? .... తన యిష్టం మొచ్చినంత స్వేచ్ఛగా తిరగవచ్చు, రెండో ఆట సినిమాకు వెళ్లి రెండున్నరకు ఇంటికి రావచ్చు. రేడియో సిలోన్ పెట్టుకోవచ్చు, అన్ని ట్లోనూ పెద్దుల్లిపాయల ముక్కలు పెద్ద పెద్దవి వేసుకోవచ్చు .... అంతదాకా ఎందుకు ఇంట్లో గూడా దర్జాగా సిగరెట్టు తాగేయొచ్చు ....

అసలు ఈరోజున స్వయంగా జీవితంలో ఫస్టున 'ఫస్టుగా' వంట చేసేయాలి ....

తను సీతామహాలక్ష్మిని పెండ్లిచేసుకున్నాడన్న మాటేగాని— చేసుకునేముందు వీసమెత్తయినా కనుక్కున్నాడా ?—వంట వచ్చా లేదా అనటా అని !

అబ్బే—నాన్నతో వెళ్లి గుప్పెడు మల్లెలు తల్లో తురుముకోని ముద్దబంతిపువ్వులా కూర్చున్న సీమ లక్ష్మిని చూచి, నాన్న 'నీకు నచ్చిందిరా ?' అని అడగటం ఆలస్యం, గుమ్మటంలా, గంగిరెద్దులా తల వూగించాడు.

కాని పెండ్లయిం తరువాత తెలిసింది తను ఎంతగా మోసబోయాడో .. . అటు అయిన మావ గారు, అత్తగారు కలిసి తనని ఎలా నరకంలో దించారో .... ఇంతపెద్ద వాలుజడ షోగ్గా వేసు కుంటుం దెందుకు .... బుద్ధి లేకపోతే సరి ! .... వంట చేతకాకపోగా !

గతపు ఆలోచనలలో పడి యిలా ఈదుతుండగా పక్కింటామె మొగుడు కాస్త గృహప్రవేశం చేసి, "పాపం ! సింహాద్రిగారూ ! మీవారు పుట్టింటి కెళ్లారటగా ?" అన్నాడు.

సింహాద్రికి తాడిచెట్టంత కోప మొచ్చింది— తనకు అది 'వారో' దానికి తను 'వారో' తెలుసు కుండేటంత వరకు ఆయన్ను దులిపేయా లను కున్నాడు గాని, మళ్లా సీతా మహాలక్ష్మికి కోప మొస్తుందేవోనని (ఎట్లాగైనా ఆమె ప్రియ స్నేహి తురాలి మొగుడు గదా !!) అంతదాన్ని మ్రింగేసి 'హిహిహీ' అన్నాడు—ఏదో ఆయన వేసిన విట్టుకి తను నవ్వినట్లుగా !

ఆయనా గబుక్కున నవ్వి, ఆపేసి—"మా ఆవిడ మీకు మరీ మరీ చెప్పమంది—ఈ నాల్రోజులు మీరు మా యింట్లోనే భోంచేయాలని !" అన్నాడు.

"ఏడవలేక పోయాడు మొగతనంలేని వెధవ !" అనుకొని పైకి మాత్రం, హీ—హీ—హిహి— ఎందుకండీ ! .... ఒకరోజా పాడా ?" అన్నాడే నసుగుతున్నట్లుగా.

"కాదు మాష్టారూ !"

"అబ్బే ! లేదు మాష్టారూ !"చేతులతోపాటు మెడకాయ బలంగా తిప్పాడు సింహాద్రి.

ఆయనేమనుకున్నాడో ఏమో చటుక్కున వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు.

సింహాద్రి తలవంచి టైం చూసుకున్నాడు. సరిగ్గా పది గంటలయింది !

ఇక వంట ప్రారంభిస్తే గంటలో పూర్తి చేయ వచ్చు. రాజాలా పది గంటలకల్లా అమోఘమైన వంటకాలతో భోజనం చేసేయొచ్చు అనుకున్నాడు స్వగతంలో సింహాద్రి.

వాకిటి తలుపులు దగ్గరకు వేశాడు. ఇస్త్రీ లుంగీ విప్పేసి మాసిన లుంగీ కట్టుకున్నాడు. చొక్కా విప్పి బనీనుతోటే వంటయింట్లోకి నడి చాడు గాని, అప్పటికి సిగరెట్టు తాగి చాలా సేప యింది అని గుర్తుకురాగా గదిలోకి వచ్చి వరసగా పది దమ్ములు లాగేసి వంటింట్లో పడ్డాడు.

కూరలబుట్ట చూస్తే చాలా రకాలున్నయి. వంకాయ కూర చేద్దామా, బెండకాయ వేపుడు చేద్దామా అని ఆలోచనలో పడ్డాడు. బెండకాయ వేపు డనుకొనేటప్పటికి ముక్కు ఎగిరెగిరి పడింది— కాని అది బహు తేలిక వంట అనిపించగా—బంగాళ దుంప కూరని చివరికి నిర్ణయించుకున్నాడు !

సరే ! బియ్యం ముందు పొయ్యిమీద పడేద్దా మనుకొని ఒక్కసారే కడిగి (విటమిన్లు కొట్టుకు పోతాయేమోనని భయపడి) వెలిగించిన స్టౌమీద పడేశాడు.

అటకమీద పెట్టిన కత్తిపీటను తీసి దుమ్ము దులిపాడు. బంగాళ దుంపలు కడిగి (!) చిన్నచిన్న ముక్కలుచేసి గిన్నెలో పడేశాడు.

అట్టి ఉధృత సమయంబులో శ్రీమాన్ సుబ్బ రాజులుంగారు ప్రవేశించి, "వత్సా ! శుభవార్త వింటిని .... ఈనాటినుండి యువకులకు నీ గృహంబు కేంద్రంబుగా చేసితివట !.... చతుర్ముఖ పారాయ ణంబునకు ప్రారంభోత్సవ మెన్నడు ?" అన్నాడు.

"నాయినా ! నే నెన్నడూ అనలేదు ఆమాట ! మా శ్రీమతిగారు వచ్చి పేకముక్కగాని, సిగరెట్టు ముక్కగాని చూచిందంటే నా పీకే నొక్కును . కనుక తమరు ఇక దయచేయవచ్చు !" నమస్కారం చేసల్లా మరీ.

"ఒరేయ్ ! .... అదేమిట్రా .... మిత్రుడివి గదా అని, కాదనవని, అంత దూరం నుండి నమ్మ కంతో పడి వస్తే అంత మాటంటావురా .... ఒరేయ్ ! సింహాద్రి—అది కాదురా .... మాకు ఇంత బాధ ఉండేది గాదురా .... ఆ వెంకటేశ్వర్లుగాడి పెండ్లాం లేదూ . . పదిహేను రోజులకు గాని రానని పుట్టింటికెళ్లి ఐదు రోజుల్లోనే తిరిగొచ్చిందిరా ... టైం ఉందిగదా అని మేం మరో హెడ్‌క్వార్టర్స్ వెతుక్కోకుండా ఉన్నాం .... ఆమె రాక మామీద పిడుగుపాటయిందనుకో .. . యేరోయ్ ! ఇవి చేతులు గావురా నాన్నా ! .... నాలుగు రోజులు ఒప్పుకో రా .. అరేయ్ సింహాద్రీ ! నాన్నా ! బాబూ ! .... మీ శ్రీమతి వచ్చేదానికి ఒకరోజు ముందుగానే మకాం మార్చే స్తాంరా . .. పేకముక్కగాని, సిగరెట్టు ముక్క గాని కనబడకుండా ఏరేసే బాధ్యత నాది .... అం....

చెప్పేంత మిత్రుడివి నీవే ఇలా అంటే ఇక నాకెం దిక్కురా ....'' అని ఏడుపుమొఖం పెట్టేశాడు.

సింహాద్రికి పాపం జాలేసింది. అప్పటికీ ఏదో అనబోయాడు గాని, వీడు తగ్గటం చూచి సుబ్బ రాజు బయటకు చూస్తూ "అరేయ్! వెంకటే శ్వర్లు, శేషగిరీ, రామనాథం .... రాండ్రా .... సింహాద్రి ఒప్పుకున్నాడ్రోయ్!" అంటూ పెద్దగా అరిచాడు.

ఇంక అంతటితో సింహాద్రి కాదనలేక, వస్తున్న వాళ్లను చూచి వంట యింట్లోకి తప్పుకుంటూ "అరేయ్! సుబ్బరాజు .... ఇటు రారా!" అన్నాడు.

సుబ్బరాజు లోపలికొచ్చి తల వంచాడు 'ఏమిటి ఆజ్ఞ' అన్నట్లు!

"ఏం లేదురా ... మరేమనుకోకు. డబ్బులు పెట్టి మాత్రం ఆడొద్దు..... తరువాత ఏమన్నా అయితే ....''

"అబ్బెబ్బే .... లేదులేదు!" వాడు మెడకాయ యొడా పెడా తిప్పాడు. "మేం పెద్ద ఆటగాళ్ళం కాదురా .... మహా ఏడిస్తే ముండమోపిది రెండు పైసలు .... ఆఁ .... నీవేం భయపడబోకు .... నే మన్నానుగా .... నీకు మాట రానిస్తానా?" అంటూనే అవతల గదిలోకి పరుగెత్తాడు.

వంటయ్యేటప్పటికి రెండు గంటలు పట్టింది. అరోజు శెలవవ్వటంతో పన్నెండు గంటలకల్లా భోజనం పూర్తి చేశాడు—వంట రోజూ తినేదాని కంటే బ్రహ్మాండంగా ఉన్నట్లే అనిపించింది—కాకపోతే ఆలోచనలలో పడటంతో బంగాళదుంప కూర క్రింద అట్టగట్టింది. పులుసులో చింత పండు తగ్గినట్లున్నది .... అన్నం వార్చటం మర్చి పోయినట్లున్నాడు— ఎట్లాగైనా స్వయంపాకం సీ మహాలక్ష్మి వంటకంటే గూడా అమోఘంగా ఉన్నట్లే అనిపించింది. వదిలిపెట్టకుండా మొత్తం గిన్నెలన్నీ ఖాళీచేసి 'బ్యావ్' మంటూ బయటి కొచ్చాడు.

సుబ్బరాజు పక్క గదిలో నుండి హడావుడిగా బయటకు వచ్చి, "అరేయ్! ఒక రూపాయి ఉంటే ఇవ్వరా! సాయంత్రం ఇస్తాను!" అన్నాడు.

సింహాద్రికి చర్రున కోప మొచ్చింది— ఏదో తేస్తే ఏదోలాగా .... వెధవలను తను తెలివితక్కు వగా లోపలజేర్చుకున్నాడుగాని—"చచ్చి గీ పెట్టుకున్నా నా దగ్గిర నయాపైసా లేదు .... ఆఁ! ...."' అని మరీ చెప్పేశాడు.

"అది గాదురా! ఆటలో వాళ్ల అప్పు పెట్ట గూడదనేది మా థీరీరా! .... అంతకంటే ఏంలేదు!" నసిగాడు.

"ఏమైనా సరే .... పిచ్చి వేషాలు మాత్రం వేయ బోకు!"

సుబ్బరాజు ఏమనుకున్నాడో ఏమో భారంగా ఐదు నిట్టూర్పులు విడిచి గదిలోకి వెళ్లిపోయాడు.

తరువాత ఆ గదిలోకి సింహాద్రి వెళ్లినప్పుడు నిజంగా సుబ్బరాజును చూచేటప్పటికి జాలేసింది. ఒక ప్రక్కన అన్నీ పోగొట్టుకున్న వరదబాధితుడి లాగా తల వంచుకు కూర్చుని దీనంగా మిగతావాళ్ల ముందున్న డబ్బుల్ని చూస్తున్నాడు!

సింహాద్రి కరిగిపోయి రూపాయి ఇవ్వబోయాడు గాని హృదయం నాలుగు తిట్టి జేబులోని చేతిని బయటకు లాగేసింది!

ఇవాళ దర్జాగా మ్యాటినీకి వెళ్దామను కున్నాడు .... ఎప్పుడో చిన్నప్పుడు (పెండ్లి కాకముందు) కాలేజీ ఎగగొట్టి వెళ్లేవాడు సర్దాగా.

వంటిగంటకు పేకాటగాళ్లు ఆవలించుకుంటూ బయటకు వచ్చారు.

అరేయ్! సింహాద్రి! ఇప్పుడే మళ్లా ఓ అర గంటలో వచ్చేస్తాం .. భోజనం చేయటం ఆలస్యం ... ఆఁ ..'' అన్నాడు సుబ్బరాజులు.

"నాయనా! కొంపలేం అంటుకోవుగాని ... సాన కాలంగా నాలుగు గంటలకు రండి!" అన్నాడు తను ఆ సమయానికి తాళమేసి ఎట్లాగో సినిమాకు వెళతాకు గదా అని!

"అరేయ్! అది కాదురా!" వాడు నసుగు తున్నాడు.

"అదిగాదు ..ఇది గాదు. ముందు గెట్ అవుట్!"

సుబ్బరాజు సింహాద్రి అరుపుకు బిక్కచిక్కి పోయి "సింహాద్రి డామాల్లోకి పనిక్కొచ్చాడ్రోయ్. హి హి హీ' అని, 'సరే లేరా!' అని గూడా వెళ్లిపోయాడు.



మరో ఇల్లు గొరికేటంత వరకు ఏమైనా వదిలి మరి!

సింహాద్రి నడుం వాల్చాడు మంచం మీద వారపత్రిక తిరగేస్తూ (క్షమించాలి—ఏదో అనాలి గాబట్టి అన్నాను గాని—నిజానికి అది శ్లాబ్ కొంప!)— ఈ నాల్రోజులు జీవితంలో మర్చిపోలేని దినాల్లా గడపాలనిపించింది—మరెన్నడూ జీవితంలో పొంద లేని ఆనందాన్ని ఈ నాల్రోజుల్లోనే మరీ రంగ రించి త్రాగెయ్యాలని నొక్కి నొక్కి అనుకున్నాడు

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు గాని .... నిద్రలో గూడా మంచి మంచి కలలే వచ్చినయి—కొంతసేపు ఒంటరిగా కాశ్మీర్ లు తిరి గాడు.... తరువాత తాజమహల్ చూస్తుండగా ప్రక్కన సీతామహాలక్ష్మి కనబడగా భయంపుట్టి పరుగెత్తాడు గాని, మరు క్షణంలోనే హంపీలు ఉండటంతో అంతకు క్రితంది కలలే అని చప్ప రించేశాడు!

అలాంటి మధుర క్షణాలలో సింహాద్రి తేలి యాడుతున్న సమయంలో—

గోడనున్న గడియారం రెండు కొట్టింది.

తలుపుమీద ఎవరో దబదబా బాదసాగారు.

సింహాద్రి తన కలలను చెరిపిన రాక్షసుల్ని తిట్టుకుంటూ, (సుబ్బరాజు మొ॥) మొఖం చిట్లించు కుంటూ మరీ తలుపు తీశాడు.

"ఏరా సింహాద్రుడూ! నీకూ పగటి నిద్ర పట్టిం దన్నమాట!." అని పెద్దగా నవ్వేసి మరీ లోపల కాలు పెట్టాడు. ఆయన—అరవయ్యేళ్ల వృద్ధుడు—శ్రీమాన్ సింహాద్రులుంగారికి సాక్షాత్తూ పెదనాన్న!

సింహాద్రి కొయ్యలా బిగుసుకుపోయాడు.

ఈ సమయంలో తన కొంపకి చుట్టాలా?— అందునా అతి చాదస్తుడైన తన పెదనాన్నా?

ఘోరం!—ఇదేరా కలికాలం అంటే అని గూడా నెత్తీ నోరూ కొట్టుకున్నాడు మనస్సులోనే.

ఆయన వచ్చిన రెండు క్షణాలలోనే నాలుగు గదులూ చుట్టేసి, "ఏదిరా కోడలుపిల్ల ఎక్కడా కనబడడంలేదు?" అన్నాడు.

"నా పిండాకూడు!" అందామనుకొని, "అది గాదే పెదనాన్నా!... వాళ్ల చెల్లెలు పెళ్లయితే పొద్దునే వెళ్లింది!" అన్నాడు.

"మరి నీ వెళ్లలేదేవిట్రా?" సాగదీశా రాయన.

"శెలవు గట్రా దొరకాలగదే!" నసిగాడు.

"అరేయ్! సింహాద్రుడూ! కాస్త ముందు మజ్జిగ ఎక్కుంటే ఇచ్చి, కాస్త అన్నం ఉడకేసి పడేస్తే ఉప్పూ కారం నలుపుకు తినేస్తాను ... నిన్న సాగున తిన్నన్నం .... గుంటూరులో మీ పిన్నమ్మ ఉడకేసి పడేస్తే రెండు మెతుకులు గతి కొచ్చాను. నా ఖర్మ కాకపోతే అపుతుం దనుకున్న పని అవకుండా పోవాలా ... నాకు ఈ ఉపవాసం గతి పట్టాలా?... త్వరగా లేచి రెండు మెతుకులు ఉడకేశావో ... నోట్లో పారేసుకుని బండెక్కేస్తాను .... అయినా కోడలుపిల్లను చూచి చాలారోజు లయిందిగదా అనుకున్నాను .... నేను చాలా రోజు లయిందిగదా ఇటుపక్క కొచ్చి .... అరేయ్! .... అది ఇంతకీ ఒక పసికూన నన్నా ఎత్తుకుందా? .... ఆఁ .. "దీర్ఘం లాగాడు.

భోంచేయగానే పోతానన్న మాటలకు ఉబ్బి తబ్బిబ్బవుతున్న సింహాద్రి, "ఆఁ ఆఁ .... లేకేం ....

ఉడపిడపి పక్కింటివాళ్ళ గిటను ఎత్తుకుంటూనే ఉంటుంది !" అన్నాడు.

ఆయన పగలబడి నవ్వారు. "అది గాదురా పిచ్చి వెన్నాసీ ! .... కోడలుపిల్ల నీళ్ళేవయినా పోసుకున్నదా అవటా అని అడుగుతుంటే .... ?" ఆయన నవ్వుకు పుల్‌స్టాపే దొరకలేదు.

సింహాద్రికి అర్థంగాక బిత్తరబోయాడు.

"నీళ్ళేం ఖర్మ .... పదిహేను రోజుల క్రితం వాళ్ళక్కయ్య వచ్చినప్పుడు తలంటించుకొని మరీ పోసుకుంటేనూ!" అన్నాడు మరీ అమాయకంగా ముఖం పెట్టి. "అరేయ్! సింహాద్రుడూ! .. మీనాన్న కడుపున నీవు తప్పబుట్టావురా ! .... సరే సరే .... పోయి ఆ మెతుకు ఉడకేయ్ !" అని తువ్వాలు వేసుకు కూర్చుని, "అరేయ్ ! సింహాద్రుడూ .... మీ పిన్నమ్మ ఏవంటుందో తెలుసా .... ?" అంటూ మధ్యలోనే ఆపేసి హడావుడి పడుతూ, "కాస్త పట్టుబట్టవున్నా కట్టుకు ఉడకెయ్యరా బాబు !.... ఆ మయిల కూడు నే నెలా తినేదిరా ?" అన్నాడు.

"పట్టుబట్ట లేదే పెద్దనాన్నా .... దాని బదులూ నాన్న పెళ్ళిలో డబ్బే తీసుకున్నాడుగదే !"

"నా శ్రాద్ధం ! .... పట్టుబట్ట లేకపోతే .... తువ్వాలు తడిపన్నా కట్టుకోరా !"

సింహాద్రికి చచ్చినంత పనయింది.

ఏం చేస్తాడు—ఏనాడు చేసుకున్న పాపమో అనుకొని తువ్వాలు తడిపి, పిండి మరీ కట్టుకున్నాడు. చలి జువ్వున లాగుతుంటే కుంపటిముందు వినురుతూ కూర్చున్నాడు.

"అరేయ్ ! సింహాద్రుడు !.... ఈలోగా ఒక్క కునుకు తీస్తానుగాని అన్నం అవ్వగానే లేపు !...." అంటూనే అన్నంతసేపు గూడా ఆగకుండా నిద్రలో పడిపోయాడు.

సింహాద్రికి మరో భయం పట్టుకుంది— ఈ పేకాట పక్షులు ఎక్కడ వాలతారోనని !.... వాళ్ళనుగాని ఈయన చూచాడో .... వాళ్ళది ఎట్లా ఉన్నా తన చర్మం వూడదీసి డోలు కట్టేస్తాడనేది ఖాయం !

"భగవంతుడా ! ఈ సింహాద్రికి ఎన్ని కష్టాలు పెట్టావురా ?"...అనుకున్నాడు. ఆ పాడు శెలవేదో పుచ్చుకొని తనూ పెండ్లికి వెళ్ళివుండవల్సింది !

"నాయనా ! కష్టాలు మానవులకు రాక మానులకొస్తాయా ? ...కష్టాలను ఎదుర్కొంటేనే మానవుడు రాటుదేలగలడు !.... ఏమైనా చేయగలడు .... హిమాలయ పర్వతా లెక్కగలడు !" ఎవరో అన్నట్లు వినిపించగా కోపమొచ్చి వినన కర్రను దబదబా బాదసాగాడు.

ఈయన మోతకు ముసలాయన లేచి, "ఏరోయ్ ! సింహాద్రుడూ !... వంటయిందేవిటి? అన్నారు ఆశగా.

"కుంపటే వెలగందే !" గొణిగాడు.

ఆయన పాపం ఒక నిట్టూర్పు విడిచి మెదలకుండా మళ్ళా పడుకున్నాడు శోష కొచ్చినవాడిలా.

తరువాత బియ్యాన్ని మెతుకుల్లా (అక్కడక్కడా మేకుల్లా) మార్చేటప్పటికి అరగంటకు పైగా పట్టింది.

ఆవురావురుమంటున్న ఆయన కాస్త, సింహాద్రి మాట వింటం ఆలస్యం. లేచి తడిగుడ్డ కట్టుకొని భోంచేసి, తరువాత పది నిముషాలకు పొడిగుడ్డ కట్టుకుని మరీ తోడ్కొక్కాడు



ఒక పెద్ద గండం గడిచి బయట పడ్డట్లుగా కాస్సేపు బుజాలు రెండూ అద్దంలో చూచుకుంటూ దులుపుకొని బయటకొచ్చిన సింహాద్రికి, డాబా మీదనుండి మాటలు వినిపించగా ముందుకువచ్చి తలెత్తి చూచాడు.

అవి సుబ్బరాజు మాటల్లా ఉన్నాయి! పక్క వైపుకు చూస్తే నిచ్చెన వేసిఉంది.

అనుమాన మొచ్చి నిచ్చెనమీదగా పైకెక్కి చూచాడు.

ఏముంది!— వాళ్ళు దీక్షంగా పేకాడుతున్నారు!

"అరేయ్!.... ఇదేవిట్రా ఇక్కడెక్కారు?" అడిగాడు ఆశ్చర్యపోతూ—తన పెదనాన్న ఉండగా క్రిందకు రానందుకు సంతోషిస్తూ.

"ఇందాక కుంపటి విసురుతున్న నీ మొఖం చూస్తే కాలిన పెనంలా ఉంది—అందుకని నిన్ను కదిలిస్తే కరుస్తావేమోనని మెదలకుండా ఇక్కడో నిచ్చెన కనబడితే పైకెక్కి ఆడుకుంటున్నాం!" అన్నాడు జాలిగా సుబ్బరాజులు.

"ఏడ్వలేకపోయావు .... క్రిందకు రండి!" అన్నాడు సింహాద్రి.

వాళ్ళు బిలబిలా, తల్లి ననుసరించే కోడిపిల్లల్లా సింహాద్రి ననుసరించి నిచ్చెన దిగారు.

పొద్దుగూకే టప్పటికి సింహాద్రి కేదో నీరసం పట్టుకుంది. ఇవాళ ఎవరి మొఖం చూస్తూ లేచాడో గాని తను—అనుకున్న ఒక్కపనీ చేయలేదు... కాక పోంగా రెండు గంటలకు పిండాకూడొండే మరో తద్దినం తగులుకుంది.

రేపు ఇక సరేసరి— రోగిష్టిమారి పెళ్ళాంలా పీక్కుతినే ఆఫీసు!

మంచంమీద నుంచి లేవ బుద్ధికాలేదు.

కాళ్ళు లాగుతుంటే అక్కడే పడుకున్నాడు.

ఆరు గంటలకు ఇక లేవక తప్పలేదు. లేచి బియ్యాం కడిగి కుంపటిమీద పడేశాడు. డబ్బా లోంచి వడియాలు తీసి కాళే నూనెలో పడేసి, వల్లబడిందాకా తిప్పాడు. పైనించల్లా ఆవకాయ జాడీ దింపి ఒక గరిటెడు కంచంలో వేసు కున్నాడు!

భోజనం అయిందనిపించేటప్పటికి ఎనిమిదిగంట లయింది.

సుబ్బరాజు తరువాత కొద్ది క్షణంలోనే బయట కొచ్చి, సింహాద్రితో "మళ్ళా ఇంకో గంటలో వస్తాం!" అన్నాడు.

సింహాద్రికి ఈసారి ఇంకాస్త పెద్ద తాడి చెట్టంత కోప మొచ్చింది. "ఇదేవన్నా క్లబ్బను కున్నారా లేక ... ఆఁ .... ఆఁ .... ఆఁ." తరువాత మాట దొరక్క మింగేసి, "రేపు సాయంత్రం దాకా పేక అన్నారో కాళ్ళిరగ్గొట్టేస్తాన్!" అన్నాడు.

సుబ్బరాజుకి ఏడుపొచ్చినంత పనయింది. ఆత గాడి సర్వీసులో ఇట్లాంటి కొంప ఎక్కడా చూడ లేదు!

కోపాన్ని లోపలే మింగేసి, ఏడుపును కక్కేస్తూ కాళ్ళమీద పడ్డంత పనిచేసి, "అయితే ఇంకో గంట సేపు ఆడుకొని ఒకేసారి వెళతాం!" అన్నాడు ప్రాధేయపడుతూ.

సింహాద్రికి జాలి ఆగలేదు. "సరే! పోండి!" అన్నాడు.

ఆరోజు అలా గడిచిపోయింది ..... ఆరోజు ఏవేవో పొడిచేద్దా మనుకున్న సింహాద్రి ఏమీ పొడవలేక పోయాడు. తరువాత మూడ్రోజులూ అంతకంటే ఘోరంగా గడిచిపోయినయి.

రెండోరోజుతోనే వంట ఒక పెద్ద తద్దినంలా అనిపించింది. కుంపటిని అట కెక్కించేసి హోటల్ భోజనం చేయటం మొదలుపెట్టాడు. సీమా లక్ష్మికి గూడా చెప్పగూడ దనుకున్నాడు. (నామర్దా చేటు!)

ఇది ఇలా ఉండగా— మాటిమాటికి సీతామహా లక్ష్మితో గడిపిన మధురక్షణాలు గుర్తుకురాగా దిగులుపడిపోయి చిక్కిపోయాడు— మూడు పైస లిచ్చి రోడ్డు ప్రక్కన తూకం తూయించుకుంటే పదిహేను పౌన్లు తగ్గినట్లే అనిపించింది.

మూడోనాటికల్లా పదిహేను రోజులకు పెరిగి నంత గడ్డం పెరిగినట్లనిపించగా, తలకాయిని ఒక పావుగంట మంగలిషాపులో పెట్టి మరీ అర్ధ రూపాయి యిచ్చి వదిలించుకొచ్చాడు.

భార్యాభర్తలు చంటి పిల్లాడితో సినిమాకి బయల్దేరారు. థియేటర్ మేనేజర్ వాళ్లని గేటు దగ్గర ఆపాడు.

మేనేజర్: మీరు హాల్లోకి రావచ్చు కానీ మీ పిల్లాడు ఆట మధ్యలో ఏడ్చి నలుగురికీ బాధ కలిగిస్తే నేను మీ డబ్బు మీ కిచ్చి బయటికెళ్లమని చెప్పాల్సి వస్తుంది.

కొంతసేపైన తర్వాత—

భర్త: సినిమా ఎలా ఉంది?

భార్య: ఏం బాగా లేదు. విసుగొస్తుంది.

భర్త: అయితే అబ్బాయిని ఏడిపించు.

ఎం. పురుషోత్తంనాయుడు (మద్రాసు)

ఒక్కొక్క క్షణంలో తన స్వయంపాకం గుర్తుకు రాగా సీమాలక్ష్మి వంటే అత్యద్భుతంగా ఉన్నదని పించింది (చచ్చినా పైకనగూడదని గూడా అను కున్నాడు!)

అత్తగారింటి కెళితే మహారాజులా, కాలు క్రింద పెట్టకుండా జరిగిపోయేది. (మావగారి కాలంనాటి ఎదడుగుల ఎత్తు పందిరి మంచంమీద బిచాణా బిగిస్తే దిగాల్సిన అవసరమే ఉండదు.)

నాలుగోరోజు సాయంత్రం అయ్యేటప్పటికి తాను పెద్ద బుద్ధితక్కువపని చేసినట్లుగానే నిర్ణ యించుకున్నాడు. మాటమాటకు చెంపలు వాయించు కున్నాడు. ఇంకెప్పుడూ సీమాలక్ష్మిని వదిలి ఉండ కూడదనే అనుకున్నాడు— అసలు సీమాలక్ష్మి పొడు గైన వాలుజడ ఎంత బాగుంటుందో ఆమె వంటా అంతే బాగుంటుందని నొక్కినొక్కి వక్కాణించు కున్నాడు.

వీటన్నిటికి తోడు పురిమీద పుట్టలాగా క్రితం రోజు సాయంత్రం నుంచి చెవికోసిన కోతిలా వో నల్లకాకి దొడ్లో పడి ఒకటే అరుస్తోంది!— దాంతో సింహాద్రికి భయం గూడా పట్టుకుంది.

రేపు అత్తగారింటికి వెళ్ళొచ్చిం తరువాత ఒక సంఘాన్ని స్థాపించి 'మొగవాళ్ళు వంట చేయటం అంటే ఎంత పెద్ద తద్దినమో' వరుసగా వారం రోజులు ఉపన్యాసాలు గూడా ఇప్పించి, తమాయిద్దా మనుకున్నాడు.

అసలు అన్నింటికంటే మహా ఘోరం ఈ పేకాట గాళ్ళది— ఆ సన్యాసులకి ఇంట్లో ఆడటం అంటే యమధర్మరాజుతో ఆడటమే .... పెండ్లాం తిట్లకు తడిసి ఎవడి పెండ్లాం ఎప్పుడు పుట్టింటికి వెళు తుందా అని భూతద్దా లేసుకు వెతుకుతుంటారు!

ఇక చచ్చినా ఇటువంటి పొరబాటుపని మాత్రం చేయగూడ దనుకున్నాడు. (దానికి తోడు ఈ నెల్లో కరెంటు బిల్లు పది రూపాయ లయ్యేలా ఉంది— రేపు సీమాలక్ష్మికి ఏం సంజాయిషీ ఇచ్చుకోవాలో?!)

ఆఫీసవ్వగానే నాల్రోజులు శెలవిచ్చిన ఆఫీసర్ని తన పూజామందిరంలో పెట్టుకుందాం అనుకుంటూ మరి పరుగెత్తుకుంటూ ఇంటి కొచ్చాడు. ఎదా రిలో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకునికి ఒయా సిస్సు కనబడితే పరుగెట్టినట్లుగా బెడ్డింగ్ తీసు కొని స్టేషన్‌కు పరుగెత్తాడు.

రైలొచ్చింది.

ఎక్కి కూర్చున్నాడు.

—అటువంటి సమయంలో స్టేషన్ బయటి నుండి పరుగెత్తుకొస్తున్న సుబ్బరాజుల్ని చూసి గుండాగినంత పనయింది సింహాద్రికి.

"పేకాడుకోవటానికి ఇంటి తాళంచెవి ఇవ్వ మనడు గదా ఖర్మ!"

త్వరత్వరగా లేచి సామాన్లు పెట్టే చెక్కమీదే పడుకుందా మనుకున్నాడు గాని లేచి పైకెక్కబోయే లోగానే సుబ్బరాజు కిటికీలోంచి 'హ్యాండు' పట్టు కొని కంగ్రాచ్యులేషన్స్‌రోయ్!" అన్నాడు.

సింహాద్రికి అర్థంకాలేదు. మంచునే తల క్రిందకు వంచాడు.

సుబ్బరాజు చెప్తున్నాడు. "ఆ విశ్వనాథం గాడు లేడు .... అట్లా వెర్రిమొఖం వేస్తావేంరా.... మన సెక్షన్ సీటు రా .... వాడి పెళ్ళాం నీళ్ళాడ టానికి పుట్టింటి కెళ్ళిందట! .. ఆరునెల్ల దాకా తిరిగి రాదట .... ఇక మా కరువు తీరా ఆడుకో వచ్చులే ... వస్తా!.... ఆఁ .." అంటూనే వెళ్ళి పోయాడు.

సుబ్బరాజు వెళ్లినవైపే నోరు తెరుచుకొని చూస్తుండిపోయాడు సింహాద్రి.

తరువాత ఎంత ఆలోచించినా సుబ్బరాజు 'కంగ్రాచ్యులేషన్స్' ఎందుకు చెప్పాడో అర్థం గాక పోవడంతో, వెళ్ళొస్తానన్న వాడికి 'థాంక్స్' చెప్పి నట్లుగా ఉన్నట్లు అనిపించగా నవ్వుకున్నాడు సింహాద్రి.

గార్డు విజిల్ వూదాడు.

రైలింజన్ కూత కూసింది.

సీమాలక్ష్మి దగ్గరకు పరుస్తున్న రైలుకు 'థాంక్స్' చెబుతూ హుషారుగా సిగరెట్టు దమ్ము లాగాడు సింహాద్రి. ★